www.kalamjyothi.com

# కలంజ్యోతి

రేపటి కోసం

సోమవారం 24.02.2025

## విలేఖరులు కావలెను




కలంజ్యోతి తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తిస్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'కలంజ్యోతి' సాదర స్వాగతం పలుకుతోంది.

సెల్ : 9494 009 003

- సహాయక చర్యలు ముమ్మరం చేసిన కీలక రెస్క్యూ విభాగాలు
- లోకో ట్రెయిన్ సాయంతో ఆర్మీ బృందం
- సొరంగ మార్గంలో 13.5 కిలోమీటర్ల వరకు
- బురద అడ్డంకిగా మారడంతో వెనక్కి
- నీటి ఉధృతితో 80 మీటర్ల వెనక్కి టన్నెల్ బోరింగ్ మిషన్
- టన్నెల్ ఉపరితలంపై నుంచి 400మీటర్లు తవ్వితే టన్నెల్ లో చిక్కుకున్న వారి వద్దకు చేరుకునే అవకాశం
- సాధ్యసాధ్యాలపై సమాలోచనలు చేస్తున్న ప్రభుత్వం, రెస్క్యూ బృందాలు



# ఆపరేషన్ టన్నెల్




## 8 మంది కోసం రెస్క్యూ

2లో



## ఆస్తికోసం అన్నను కొట్టి చంపిన చెల్లెళ్లు

3లో

- అట్టహాసంగా లక్ష్మీనరసింహస్వామి ఆలయ మహా కుంభాభిషేకం
- హాజరైన సీఎం దంపతులు, భక్తులు

## యాదగిరీశుడికి స్వర్ణ గోపుర శోభ

3లో



# నేడు ప్రజావాణి రద్దు

## జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్



**కలంజ్యోతి, జగిత్యాల :** కలెక్టరేట్ లో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ సత్య ప్రసాద్ నేడు ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ప్రజావాణి కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని సూచించారు.



# సిద్ధార్థలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**కలంజ్యోతి, చెన్నారావుపేట :** వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండల కేంద్రంలోని సిద్ధార్థ గురుకుల విద్యాలయంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం 2003 04వ తరగతి చదువుకున్న వారు పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు పాఠశాలలో చదువుకున్న రోజుల్లో తమ చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకొని ఆనందంగా గడిపారు. 20 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థులు ఒకచోట కలుసుకోవడం సంతోషంగా సాగింది. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను శాలువాలతో కప్పి షీల్డ్ ల తో సన్మానించారు. కార్యక్రమంలో సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ కంది గోపాల్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఇంద్రసేనారెడ్డి, ఉపాధ్యాయులు రారోజు రవీందర్, నూనె రాములు, బియ్యాల సతీష్, దుప్పటి సుధాకర్, యాకూబ్, శ్రీనివాస్, సుభాషిని, లక్ష్మణ్, కుమారస్వామి, వ్యాయామ ఉపాధ్యాయులు సతీష్, యుగంధర్, సుధాకర్ పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



# యాదగిరి శేఖర్ రావును భారీ మెజార్టీతో గెలిపించాలి

**కలంజ్యోతి, భీమదేవరపల్లి :** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో ట్రస్మా ప్రయివేట్ , పాఠశాలల సంఘం రాష్ట్ర చీఫ్ అడ్వైజర్ యాదగిరి శేఖర్ రావును భారీ మెజారిటీతో గెలిపించాలని భీమదేవరపల్లి మండల ట్రస్మా నాయకులు కొత్తకొండలో ఆదివారం విస్తృ త ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రైవేట్ విద్యాసంస్థలలో పనిచేసే బోధన బోధనేతర సిబ్బంది సమస్యల కోసం పోరాడే వ్యక్తి, ఎన్ఐఓఎస్ ద్వారా రాష్ట్రంలో సుమారు లక్ష మందికి పైగా డి స్టెన్సులో డిప్లొమా ఇన్ఎల్మెంటరీ ఎడ్యుకేషన్ పూర్తిచేసి టీచర్ ఉద్యోగానికి అర్హత సాధించడానికి కారకుడు యాదగిరి శేఖర్ రావు అని అన్నారు. మేధావులు, విద్యావంతులకు, పట్టభద్రులు, నిరుద్యోగులు అందరూ ఫిబ్రవరి 27వ, తేదీ రోజు జరిగే పట్టభద్రుల ఎన్నికల పోలింగ్ లో పాల్గొని యాదగిరి శేఖర్ రావు (సీరియల్ నెంబర్.47) కు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్మా నాయకులు బేరే యాదగిరి, కొండబత్తిని రాజేశం, పెగడపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.




# ఆపరేషన్ టన్నెల్

**కలంజ్యోతి, నాగర్ కర్నూల్ :**

ఎస్ఎల్బీసీ టన్నెల్ పైకప్పు కూలిన ప్రమాదంలో చిక్కుకున్న 8 మంది సిబ్బందిని రక్షించేందుకు చేపట్టిన సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ సహాయక చర్యల్లో 24 మంది సింగరేణి బృందం 120 ఎస్డీఆర్ఎఫ్ బృందాలు, ఆర్మీ టీమ్, రాష్ట్ర పోలీసులు పాల్గొన్నారు. సహాయక బృందాలు సొరంగ మార్గంలో 13.5 కిలోమీటర్ల వరకు వెళ్లాయి. మరో కిలోమీటరు వెళ్లేందుకు మట్టి, నీరు అడ్డంకిగా మారాయి. ఫలితంగా రెస్క్యూ ఆపరేషన్ కు ఆటంకంగా మారింది. అడ్డంకులను అధిగమించి ఘటనా స్థలానికి చేరుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు సొరంగలో నీటి ఉధృతికి టన్నెల్ బోరింగ్ మిషన్ 80 మీటర్ల వెనక్కి వచ్చినట్లు సమాచారం. టన్నెల్ బోరింగ్ వెనక్కి రావడంతో 200 మీటర్ల గ్యాప్ ఏర్పడింది. దీంతో చిక్కుకున్న వారి స్పందన కోసం సొరంగంలో రెస్క్యూ టీమ్ అరుపులు, కేకలతో హోరెత్తిస్తున్నారు. అండర్ వాటర్ స్కానర్లు, లైఫ్ జాకెట్లు ధరించి సొరంగం కూలిన ప్రాంతానికి ఆర్మీ బృందం లోకో ట్రెయిన్ సాయంతో వెళ్తున్నది. 14 కిలోమీటర్లలో 12 కిలోమీటర్ల వరకే ట్రెయిన్ వెళ్లే అవకాశం ఉండగా.. మిగిలిన దూరం నడుచుకుంటూ వెళ్తారా? తిరిగి వస్తారా? అనే ఉత్కంఠ నెలకొన్నది. ప్రమాదం జరిగిన చోట టన్నెల్ ఉపరితలం పై నుంచి 400మీటర్లు తవ్వితే టన్నెల్ లో చిక్కుకున్న వారి వద్దకు వెళ్లవచ్చన్న ప్రతిపాదనలను అధికారులు, ఎన్డీఆర్ఎఫ్ అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ విషయాన్ని మంత్రి ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాకు వివరించారు.

### క్షేమంగా బయటికి రావాలని..

టన్నెల్‌లో చిక్కుకున్న 8మంది ప్రాణాల కోసం నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు ఎదురుచూస్తున్నారు. వారంతా సురక్షితంగా తిరిగి రావాలని రాష్ట్ర వ్యాప్తంగా పూజలు చేస్తున్నారు. రెండు వైపులా పూర్తిగా మట్టి, బురద నిండిపోవడంతో లోకో ట్రైన్‌లో సొరంగంలో వెళ్లిన ఎన్డీఆర్ఎఫ్



బృందాలు వెనుదిరిగాయి. లోపలి పరిస్థితిని ఫొటోలు, వీడియోల రూపంలో చిత్రీకరించుకొచ్చారు. ఎంతో కష్టపడి టీబీఎం ముందు వైపునకు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు చేరుకున్నాయి. నీరు, మట్టి, బురద తోడేవరకు చిక్కుకున్న వారిని బయటకు తీయలేమని అక్కడున్న మంత్రులు ఉత్తమ్ కమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావుకు వివరించారు. కాగా.. శనివారం ఉదయం పనికోసం టన్నెల్‌లోకి మొత్తం 52మందికి పైగా సిబ్బంది, కార్మికులు వెళ్లగా.. అనుకోకుండా టన్నెల్లో ఒక్కసారిగా నీళ్లు.. మట్టిపెడ్డ కులాయి.. వెంటనే పనులు చేస్తున్న కార్మికులు.. సిబ్బంది ప్రాణాలు అరచేత పెట్టుకుని బయటకు వచ్చారు. ముగ్గురు కార్మికులు గాయపడడంతో వారిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. మిగతా 8 మంది కార్మికులు బయటకు రాలేక, అక్కడే ఉండి పోవడంతో.. అందరిలో ఉత్కంఠ మొదలైంది. అయితే గల్లంతయిన 8 మంది సురక్షితంగా ఉన్నారా? లేదా మట్టి.. నీళ్లల్లో కలిసిపోయారా? అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.



### రంగంలోకి నేవీ

ఎస్ఎల్బీసీ టన్నెల్ పై కప్పు కూలి.. అందులో చిక్కుకున్న 8 మంది కార్మికులను సురక్షితంగా బయటికి తీసుకువచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సర్వశక్తులొడ్డుతున్నాయి. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు నేవీ బృందం కూడా రంగంలోకి దిగింది. ఆదివారం సాయంత్రం వైజాగ్ నుంచి శ్రీశైలం బయలుదేరిన నేవీ బృందం అర్ధరాత్రి ఘటనా స్థలానికి చేరుకున్నది. అత్యవసర పరిస్థితుల్లో నేవీ టీమ్.. ఇటువంటి అనేక రెస్క్యూలను విజయవంతంగా నిర్వహించిన చరిత్ర ఉండడంతో వారిని కూడా రంగంలోకి దింపుతున్నారు. ఇప్పటికే ప్రమాద స్థలంలో ఆర్మీ నిపుణుల బృందం పర్యవేక్షణ చేస్తుంది. టన్నెల్‌లో పేరుకుపోయిన బురద, నీటిని దాటుకుంటూ రెస్క్యూ టీమ్ ముందుకు పోయింది. బోరింగ్ మెషీన్ దగ్గరకు చేరుకున్న రెస్క్యూ టీమ్ కార్మికుల ఆచూకీ కోసం రెస్క్యూ టీమ్ ప్రయత్నాలు చేస్తుంది. టన్నెల్ లోపల చిక్కుకున్న సిబ్బంది ఆచూకీ లభిస్తే.. వెంటనే లోపల పరిస్థితులను అంచనా వేసి.. సహాయక చర్యలు వేగవంతం చేయనున్నట్లు తెలుస్తున్నది.



కలంజ్యోతి
3
సోమవారం 24.02.2025 Local News

# యాదగిరీశుడికి స్వర్ణ గోపుర శోభ



**కలంజ్యోతి, యాదాద్రి భువనగిరి :** తెలంగాణ ప్రసిద్ధ పుణ్య క్షేత్రం యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో మహా కుంభాభిషేకం, సంప్రోక్షణ కార్యక్రమాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి భక్తులు, అధికారులు, ప్రజాప్రతినిధులు భారీగా తరలి రావడంతో పండుగ వాతావరణం నెలకొన్నది. పూజల్లో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి దంపతులు స్వర్ణ విమాన గోపురాన్ని గోపుర మహా కుంభాభిషేక సంప్రోక్షణల మధ్య ఆవిష్కరించారు. వానమామలై మఠం 31వ పిఠాధిపతి రామానుజ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో పంచకుండాత్మక నృసింహ మహాయాగం నిర్వహించి స్వర్ణ విమాన గోపుర ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని సీఎం రేవంత్ రెడ్డి దంపతుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. మహా సంప్రోక్షణకు 40 జీవ నదుల జలాలతో అభిషేకించి సంప్రోక్షణ చేసి స్వర్ణ విమాన గోపుర ఆవిష్కరణ క్రతువును వైదిక బృందం శాస్త్రయుక్తంగా నిర్వహించింది. స్వర్ణ విమాన గోపుర ఆవిష్కరణ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి దంపతుల వెంట స్థానిక ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఉన్నారు. అద్భుత కృష్ణ శిల్పకళా వైభవంతో నిర్మితమైన యాదగిరిగుట్ట ఆలయం స్వర్ణమయ శోభితమైన బంగారు విమాన గోపురం నేటి నుంచి భక్తులు దర్శించుకునే అవకాశం లభించింది. కాగా.. స్వర్ణ విమాన గోపురం ఎత్తు 5.05అడుగులు ఉండగా వైశాల్యం 10,759చదరపు అడుగులు ఉంది. 68 కిలోల బంగారంతో విమాన గోపురాన్ని స్వర్ణ రేకులతో రూ.3.80కోట్లతో స్వర్ణ తాపడం చేశారు. తాపడం అమర్చే పనులకు మొత్తం 68 కిలోల బంగారం, గోల్డ్ ప్లేటింగ్ తయారీ, అమరిక పనులుకు రూ.8 కోట్లు వెచ్చించారు. మార్చి 1నుంచి జరిగే స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు ముందే స్వర్ణ విమాన గోపురం ప్రతిష్టాపన పనులు పూర్తయ్యాయి. స్వర్ణ విమాన గోపురంపై ఉన్న నృసింహ అవతారాలు, విష్ణుమూర్తి, లక్ష్మీ(ఆండాళ్ అమ్మవారు), గరుడమూర్తులు భక్తులకు స్వర్ణమయంగా కనువిందు చేయనున్నాయి. స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు మార్చి 1నుంచి ప్రారంభమై 23వరకు కొనసాగుతాయి. 8న స్వామి అమ్మవార్ల కల్యాణోత్సం నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాలలో స్వామివారికి అలంకార, వాహన సేవలు ఘనంగా నిర్వహిస్తారు.

# మానాలలో శివస్వాముల పడిపూజ



## హాజరైన నియోజకవర్గ ఇంచార్జి ముత్యాల సునీల్‌కుమార్

**కలంజ్యోతి, రుద్రంగి :** రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మానాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తుమ్ జలపతి సోదరి గొల్లమాడ గణేష్ జల స్వగృహంలో శివపూజను ఆదివారం వైభంగా నిర్వహించారు. కార్యక్రమానికి బాల్కొండ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శివస్వాములు భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కమ్మర్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పాలేపు నర్సయ్య, కమ్మర్ పల్లి మండల అధ్యక్షులు సుకెంట రవి, రుద్రంగి మండల అధ్యక్షుడు తుమ్ జలపతి, జక్కు మోహన్, జక్కు వంశీ, బుర్ర నారాయణ, బుర్ర తిరుపతి, గురుదాస్ నాయక్, లక్కాకుల రమేష్, జక్కుల శ్రీనివాస్, తుమ్ రమేష్, అల్లూరి రాజారెడ్డి, పూర్ణచంద్, గంగాధర్, భీమానాయక్, మధన్, తిరుపతి,యశోజి శేఖర్, పాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.




# ఆస్తికోసం అన్నను కొట్టి చంపిన చెల్లెళ్లు

## జగిత్యాల జిల్లాలో ఘటన



**కలంజ్యోతి, జగిత్యాల :** మానవసంబంధాలు మంట కలిసేలా ఆస్తికోసం అన్నను చంపిన ఘటన జగిత్యాల జిల్లా కేంద్రం లోని పోచమ్మవాడలో జరిగింది. నేటి తరంలో ఆస్తులు, డబ్బు, అంతస్తుల నీడ న అత్మీయతలు, అనుబంధాలు కనుమ రుగవుతున్నాయి. అన్న, చెల్లె, తమ్ముడు, అక్క అనే బంధాలు కానరాకుండా పోతున్నాయి. దీంతో మనిషనేవాడు మాయమై, మానవత్వం మంటగలిసి.. ఆస్తికోసం అన్నాచెల్లెల్లు, అన్నదమ్ములు ఒకరినొకరు కొట్టుకుని చంపుకుం టున్నారు. ఆస్తికోసం ఇద్దరు అక్కాచెల్లెల్లు అన్నను కొట్టి చంపారు. ఈ ఘటన జగిత్యాల జిల్లాలో జరిగింది. జగిత్యాల జిల్లా కేంద్రం పోచమ్మవాడలో ఉండే జంగిలి శ్రీనివాస్ అతడి చెల్లెళ్లు శారద, వరలక్ష్మి మధ్య కొంతకాలంగా ఆస్తిపరమైన విషయాల్లో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో పలుమార్లు ఘర్షణ పడ్డారు. కాగా.. ఆస్తితగదాలతో ఇటీవల అన్నపై ఇద్దరు చెల్లెళ్లు శారద, వరలక్ష్మి కర్రలతో దాడి చేశారు. దీంతో తీవ్ర గాయాలైన జంగిలి శ్రీనివాస్ ను అతడి కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీనివాస్ (ఫిబ్రవరి 23)న మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు జగిత్యాల పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులిద్దరు పట్టణ పోలీస్ స్టేషన్ లో లొంగిపోయారు. కాగా.. ఆస్తికోసం అన్నను చంపిన చెల్లెళ్లపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



# వధూవరులకు చింతల ఆశీర్వాదం

**కలంజ్యోతి, నర్సాపూర్ :** తూప్రాన్ లో జరిగిన పలు వివాహాది శుభ కార్యక్రమాల్లో పీఏసీఎస్‌సీ చైర్మన్ చింతల వెంకటరామిరెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం కొంతంపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి యాదగిరి కుమారుడు కర్ణాకర్ ఎంగేజ్మెంట్ లో పాల్గొని వారిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో పీఏసీఎస్‌సీ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, గ్రామస్తులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.



# బీరప్ప ఆలయంలో రేవూరి పూజలు

**కలంజ్యోతి, గీసుగొండ :** వరంగల్ జిల్లా ఆత్మకూరు గ్రామంలో మహంకాళి బీరప్ప, నందీశ్వర, సింహ వాహన, పోతురాజు భోగన్న విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి సహకరిస్తానని, బీరప్ప స్వామివారి ఆశీస్సులు పరకాల నియోజకవర్గ ప్రజలపై ఉండాలని కోరారు.



# అది అంత ముఖ్యమైన విషయం కాదు..



గ్లోబల్ స్టార్ హీరోయిన్ ప్రియాంక చోప్రా మనందరికీ సుపరిచితమే. తమిళ చిత్రసీమ ద్వారా ఇండస్ట్రీకి పరిచయం అయిన ఈ ముద్దుగుమ్మ వరుస విజయాలు అందుకుంటూ బాలీవుడ్ ఇండస్ట్రీలో అడుగుపెట్టింది. అక్కడ కూడా ఎన్నో బ్లాక్ బస్టర్ చిత్రాల్లో నటించి, మెప్పించింది. తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. తన నటన, డ్యాన్స్‌తో ప్రేక్షకుల మదిలో చెరగని ముద్ర వేసుకుంది. అతి తక్కువ సమయంలోనే కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న హీరోయిన్‌గా నిలిచింది. ప్రస్తుతం ప్రియాంక చోప్రా హాలీవుడ్ లో వరుస సినిమాలతో ఫుల్ బిజీ అయిపోయింది. గ్లోబల్ నటిగా మంచి పేరు తెచ్చుకుంది. ఇక హాలీవుడ్ స్టార్ నిక్ జోనస్ ప్రేమించి పెళ్లి చేసుకుంది. నిన్న మొన్నటి వరకు బాలీవుడ్‌లో సినిమాలు చేస్తూ నేషనల్ స్టార్‌గా ఉన్న అమ్మడు .. ఇప్పుడు హాలీవుడ్‌లో భారీ ప్రాజెక్ట్స్ చేస్తూ ఇంటర్నేషనల్ స్టార్‌గా మారింది. ఇటీవలే సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శక ధీరుడు రాజమౌళి కాంబోలో తెరకెక్కబోతున్న మూవీలో ప్రధాన పాత్రలో నటిస్తోంది. ఇదిలా ఉంటే.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మాజీ ప్రపంచ సుందరి సంచలన కామెంట్స్ చేసింది. ఆమె మాట్లాడుతూ.. 'చాలామంది వ్యక్తులు తమ భార్యలు వర్జీన్‌గా రావాలని కోరుకుంటారు. కానీ వర్జిన్ అనేది అంత ముఖ్యమైన విషయం కాదు. వర్జినిటీ అనేది ఒక్క రాత్రిలో పోతుంది. దానికోసం పెద్దగా పట్టించుకోవద్దు. అర్థం చేసుకుని నచ్చిన విధంగా ఉండే అమ్మాయి జీవిత భాగస్వామిగా రావాలని కోరుకోవాలి. ఎందుకంటే మంచి చెడు అనేది మనిషి ముఖం మీద కనిపించదు. ఒక అమ్మాయి ఒక మగాడిని నమ్మితే ఏదైనా చేస్తుంది. కానీ కలిసిన ప్రతి జంట వివాహ బంధంలోకి అడుగుపెట్టాలని లేదు. అందుకు అదృష్టం ఉండాలి. అది వర్కౌట్ అవ్వనప్పుడు ఇంకొకరితో జీవితం పంచుకుంటాం. అలాంటప్పుడు వర్జినిటీ గురించి పట్టించుకోవద్దు' అంటూ చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ప్రియాంక చోప్రా చేసిన కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. కాగా దీనిపై నెటిజన్లు రకరకాలుగా కామెంట్స్ చేస్తున్నారు.